రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్న మహనీయులను స్మరించుకున్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని భారత పౌరులంతా కొనసాగించాలని వక్తలు పేర్కొన్నారు.

మార్కాపురం టౌన్: ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారతదేశానిదేనని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరికీ రాజ్యాంగం అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల పూర్తయినందుకు గుర్తుగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శార్వాణి, రాందాస్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి చైర్మన్ బాలమురళీకృష్ణ, కమిషనర్ నారాయణరావు, మేనేజర్ శ్రీనివాసన్, నాయకులు ఉత్తమ్‌కుమార్, నాసర్‌వలి, కరిముల్లా, టీవీ.సత్యనారాయణ, ఎస్‌కే మౌలాలి, ఎస్.కొండయ్య తదితరులు నివాళులర్పించారు.

మార్కాపురం: రాజ్యాంగ నిర్మాతలు మహనీయులని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన సందేశంలో పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జార్జి కళాశాల విద్యార్థులకు తన సందేశాన్ని పంపారు. మహనీయుల ఆశయాలు కొనసాగిద్దామని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ డాక్టర్ మస్తానయ్య, ఎన్ఎస్ఎస్‌పీఓ సురేష్‌కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు. జార్జి ఫార్మసీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజా జయరావు, సిబ్బంది నివాళులర్పించారు. అంబేడ్కర్ చూపిన బాటలో నడవాలని విద్యార్థులకు పంపిన సందేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు.


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్


మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న చైర్మన్ చిర్లంచర్ల, అధికారులు


మార్కాపురం: ప్రతిజ్ఞ చేస్తున్న తహశీల్దార్ చిరంజీవీ, సిబ్బంది


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంకల్ప వేదిక అధ్యక్షుడు రంగసాయిరెడ్డి

రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ సేవలు అమూల్యం

పొదిలి: భారత రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జాతికి అందించిన సేవలు అమూల్యమని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఎస్.వి.ప్రత్యూష కొనియాడారు. స్థానిక కోర్టులో న్యాయ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి ప్రత్యూష మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర గురించి వివరించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షబ్బీర్, డి.రామారావు, జి.శ్రీనివాసులు, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఏబీఎం పాఠశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.శ్యాంసన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మార్కాపురం రూరల్: రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ శ్రీను, సిబ్బందితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కొనకనమిట్ల: రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎంఈఓ–2 బరిగె నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తర్లుపాడు: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో రాజ్యాంగ అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవం, సాంఘీకశాస్త్ర దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుడు ఐవీ శేషయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌లో మానవహారంగా విద్యార్థులు


పొదిలి : మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూష


బేస్తవారిపేట బాలికల హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న బాలికలు

గిద్దలూరు రూరల్: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించి అనుసరించాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి అన్నారు. తమ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చర్మకారుల సంక్షేమ సమితి కార్యదర్శులు జేడీ రంగయ్య, ఎలీషా, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభం: రాజ్యాంగం ప్రజలకు రక్షణ గోడ లాంటిదని ప్రధానోపాధ్యాయుడు రసూల్ బేగ్ పేర్కొన్నారు. స్థానిక పార్కు వీధిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాచర్ల: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ అడుగుజాడల్లో విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో అన్నా, ఉడుముల పూజలు


పూజలు నిర్వహిస్తున్న అన్నా, ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి పూజలు నిర్వహించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి పర్యవేక్షణలో అయ్యప్ప మాలధారణ స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, పార్టీ నాయకులు ఉడుముల గురవారెడ్డి, సూరవరపు పెద వెంకటరెడ్డి, దిబ్బారెడ్డి, వెలుగొండారెడ్డి, సీసీకేఆర్ శ్రీను, శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

రగ్బీ బాల బాలికల జట్లు ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చంద్రశేఖర్, రవిప్రసాదరెడ్డి

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రగ్బీ అండర్–12 జిల్లా స్థాయి బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఎస్.రవిప్రసాదరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి మంచి పేరు తీసుకరావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం మధుసూదన్, బీవీ రెడ్డి, ఓబులరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ బాలగురవయ్య, ఈసీ మెంబర్ ఓడీ షకీలా, జిల్లా కోచ్ భార్గవి, పీఈటీ ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సక్రమంగా చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అర్ధవీడు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంతోపాటు కూలి సక్రమంగా అందించాలని ఎంపీపీ మేడూరి వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సోషల్ ఆడిట్ నిర్వహించారు. డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్, డీవీఓ జాన్సీ రాణి పాల్గొని పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, ఎంపీడీఓ నర్సయ్య, ఏపీడీ భాస్కరరావు, ఏపీఓ శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ


దొంగలు పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కొనకనమిట్ల: పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి తీగ చోరీ చేసిన సంఘటన కొనకనమిట్ల సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలువురు రైతులు సిద్ధవరం వెళ్లే దారిలో బోర్ల కింద పంటలు సాగు చేశారు. పొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగలగొట్టి రాగి తీగ చోరీ చేయడంతో నీటి తడులు అందించేందుకు వీల్లేకుండా పోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. చోరీ విషయాన్ని పోలీసులతోపాటు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినట్లు రైతులు పి.తిరుపతిరెడ్డి, నాగిరెడ్డి, పెద వెంకటరెడ్డి తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: మద్యం తాగడం ఆరోగ్యానికి చేటు చేస్తుందని, తాగి వాహనాలు నడపవద్దని రూరల్ ఎస్సై అంకమరావు హెచ్చరించారు. దరిమడుగు హైవే వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

హోమియో వైద్యశాల మూత!

- డాక్టర్ బదిలీతో పెద్ద దిక్కుగా ఉన్న కాంపౌండర్
- రెండు నెలల క్రితం కాంపౌండర్‌కు డిప్యుటేషన్
- వైద్యశాలను తెరిపించాలని వేడుకుంటున్న గ్రామస్తులు

కొనకనమిట్ల: అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా తయారైంది కొనకనమిట్ల మండలం పెదారికట్ల హోమియో వైద్యశాల పరిస్థితి. వైద్యశాలలో ఉన్న డాక్టర్‌ను ఎక్కడికో బదిలీ చేశారు. దీంతో కాంపౌండర్ వైద్యశాలకు వచ్చే వారికి హోమియో మందులు ఇచ్చి పంపేవారు. కానీ ఆయనను కూడా డిప్యుటేషన్‌పై సాగనంపారు. దీంతో అప్పటి నుంచి వైద్యశాల మూతపడింది. ఆస్పత్రిలో మందులు లోపలే మగ్గిపోతున్నాయి. సుమారు 50 ఏళ్ల క్రితం పెదారికట్లలో పంచాయతీ భవనంలోని ఓ గదిలో ఏర్పాటు చేసిన హోమియో వైద్యశాల చుట్టపక్కల నాలుగు గ్రామాల ప్రజలకు సైతం ఉపయోగకరంగా ఉంది. కొన్నేళ్లుగా ఉన్న డాక్టర్‌ను బదిలీ చేయడంతోపాటు రెండు నెలల క్రితం కాంపౌండర్‌ను మన్నేపల్లిలోని వైద్యశాలకు డిప్యుటేషన్‌పై పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కాంపౌండర్‌ను బదిలీ చేసినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. హోమియో వైద్యశాల మూతపడటంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లక తప్పడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పెదారికట్ల వాసులు హోమియో వైద్యశాల వద్ద నిరసన తెలిపారు. అధికారులు స్పందించి వైద్యశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు.


వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

హోమియో వైద్యం చేయాలి

ప్రభుత్వ హోమియో వైద్యశాల నాలుగు గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడింది. హోమియో మందులు వాడటం వల్ల జబ్బులు నయం కావడంతో చాలా మంది ఆస్పత్రికి వస్తున్నారు. డాక్టర్‌తోపాటు కాంపౌండర్‌ను బదిలీ చేయడం అన్యాయం. అధికారులు స్పందించి హోమియో వైద్యశాలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

–బి.ఓబులు, పెదారికట్ల

ఉన్నధికారుల ఆదేశాల మేరకు డిప్యుటేషన్

పై అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ ఉన్న కాంపౌండర్‌ని మన్నేపల్లికి డిప్యుటేషన్‌పై పంపాం. మేము చేసేది ఏమీ లేదు. కొత్తవారు వచ్చే వరకు వైద్యశాల మూతపడాల్సిందే. కొత్తగా స్టాఫ్ వస్తే ముందుగా పెదారికట్లకు పంపించి వైద్యశాలను తెరిపిస్తాం.

– ఆర్‌డీడీ, పద్మజాతి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం రవికుమార్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు హిందీ, ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్ స్టడీస్ స్టడీ మెటీరియల్‌ను చిలకల యల్లారెడ్డి జ్ఞాపకార్థం అక్కపల్లి ఎంపీటీసీ బాలరంగారెడ్డి మంగళవారం అందజేసినట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు సుధాకర్ 10వ తరగతిలో 550 మార్కులు సాధించిన వారికి రూ.1,116, 560 మార్కులు సాధించిన వారికి 2116, 570 సాధించిన వారికి 3116, 580 సాధించిన వారికి 4,116, 590 సాధించిన వారికి 5116, 600 సాధించిన వారికి 6,116 రూపాయల నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. దాతలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పత్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కేవీ రమణారెడ్డి, వెంకటేశ్వరరావు, గంగాభవానీ, బాదుల్లా పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చర్చి సభ్యులు

మార్కాపురం: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ పులుకూరి అమృత్‌తేజ్ వాక్య సందేశం అందించారు. సండే స్కూల్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. చర్చి యువత, స్త్రీల సమాజం క్వయర్ బృందం ప్రత్యేక గీతాలు ఆలపించారు. కమిటీ సభ్యులు సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యాండిల్ లైటు సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు దేవరకొండ సామ్యేలు, ఉపాధ్యక్షుడు కంభం తహసీల్దార్ విడుదల కిరణ్, కార్యదర్శి జయరావు, కోశాధికారి రామస్వామి, కమిటీ సభ్యులు పోలయ్య, ఆర్థర్, శరణ్‌కుమార్, సతీష్, ప్రదీప్, విజయకుమారి, సుజాత, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవానీ, యూత్ డైరెక్టర్ సౌమ్య, స్త్రీల సమాజం అధ్యక్షురాలు సలోమీ ప్రసాద్, క్వయర్ డైరెక్టర్ వరప్రసాద్, సంద్రపాటి దాసు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నేత భూ ఆక్రమణ అడ్డగింత


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్‌ఓ, సర్వేయర్

తర్లుపాడు: మండలంలోని గానుగపెంటకు చెందిన పశువుల మేతబీడు భూమిని మార్కాపురం మండలం రాయవరానికి చెందిన ఓ టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యులు ఆక్రమించి మామిడిమొక్కలు నాటుతుండగా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ విజయ భాస్కర్ ఆదేశాలతో వీఆర్‌ఓ, సచివాలయ సర్వేయర్ గానుగపెంటలోని సర్వే నంబర్ 10లోని భూమి వద్దకు చేరుకుని మొక్కలు నాటిన విషయాన్ని గుర్తించారు. మొక్కలను తొలగించడంతోపాటు మేతబీడు భూమిని ఆక్రమిస్తే శిక్షార్హులు అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


కొమరోలులో మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య

మార్కాపురం: సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. మంగళవారం స్థానిక కమలా హైస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: స్థానిక రెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై టుటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే వెబ్ లింక్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. విద్యపై దృష్టి సారించాలని చెప్పారు.

కొమరోలు: సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య సూచించారు. స్థానిక సర్వెట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనుమానిత నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే సమాధానం ఇవ్వద్దని స్పష్టం చేశారు. తల్లిదండ్రులకు కూడా సైబర్ మోసాల గురించి తెలియజెప్పాలన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లునాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

